క్లుప్తంగా

శోభారాణిని సన్మానించిన వీసీ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో జియాలజీ విభాగం ల్యాబ్ అటెండెంట్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన టి.శోభారాణిని శుక్రవారం అకాడమిక్ కమిటీ హాల్‌లో రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జియాలజీ విభాగం అధిపతి ఆచార్య ఆర్.మల్లికార్జున్ రెడ్డి, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సార్ యూనివర్సిటీలో పోలీసుల తనిఖీలు



హసన్‌పర్తి : ఎస్సార్ యూనివర్సిటీలో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. పోలీసులు, యాంటీ డ్రగ్స్ బృందం సంయుక్త ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా బాలుర హాస్టల్స్, క్యాంటీన్ చుట్టుపక్కల ప్రదేశాల్లో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి, డాగ్‌స్క్వాడ్ సహాయంతో తనిఖీలు చేశారు. స్థానిక సీఐ చేరాలు, యాంటీ డ్రగ్స్ టీం ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్సై దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు కృష్ణవేణి ఎంపిక



కృష్ణవేణిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్ : మలేషియాలో ఈనెల 28 నుంచి ఆగస్టు 2 వరకు 10వ ఏషియన్ పారా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు కేయూ దివ్యాంగ విద్యార్థిని ఎం.కృష్ణవేణి ఎంపికైనట్లు కేయూ దివ్యాంగుల సెల్ డైరెక్టర్ రాజు తెలిపారు. శుక్రవారం ఆడిటోరియం వద్ద కృష్ణవేణిని వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం అభినందించారు.

రైలులో తప్పిపోయిన మహిళ

కాజీపేట రూరల్ : చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక మహిళ తప్పిపోయింది. స్థానిక జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి శుక్రవారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా కనిగిరి మండలం ముద్దపాడుకు చెందిన అపర్ణ అలియాస్ ఆదిలక్ష్మి గత నెల 29న చార్మినార్‌లో మేనత్త సాలమ్మతో కలిసి కాజీపేటకు వెళ్తున్నారు. ఖమ్మంలో అపర్ణ నిద్రించి ఉండగా మేనత్త చూసింది. ఇదిలా ఉండగా వరంగల్ తర్వాత కాజీపేట స్టేషన్ వచ్చే ముందు అపర్ణను లేపడానికి వెళ్లగా బెర్త్‌పై కనిపించకపోవడంతో తప్పిపోయి ఉంటుందని గుర్తించింది. తర్వాత కాజీపేటలో సాలమ్మ దిగి అల్లుడు, కూతురుకు సమాచారం ఇచ్చింది. తెల్లవారుజామున అందరు కలిసి సికింద్రాబాద్, నాంపెల్లికి వెళ్లి వెతుకగా అపర్ణ జాడ తెలియలేదు. జూలై 1న మహబూబాబాద్, ఖమ్మం బంధువుల ఇంటి వద్దకు వెళ్లి వెతకగా ఆచూకీ తెలియలేదు. గురువారం రాత్రి కాజీపేట జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లో సాలమ్మ ఫిర్యాదు చేసిందని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

న్యూశాయంపేట : వరంగల్ నగరంలోని యాకూబ్‌పుర ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ నుంచి శుక్రవారం ఉదయం తప్పిపోయిన బాలుడిని మిల్స్‌కాలనీ పోలీసులు వెతికి తల్లిదండ్రులకు అప్పగించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు రైల్వే స్టేషన్‌లో వెతకగా బాలుడు దొరికాడు. అతడిని తల్లిదండ్రులకు సమాచారం అందించి క్షేమంగా అప్పగించారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించనందుకు పోలీస్‌లను సీఐ రమేష్ అభినందించారు.

నెత్తుటి మరకల కలకలం

న్యూశాయంపేట : నగరంలోని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాశికుంటలో రోడ్డుపై నెత్తుటి మరకలు కనిపించడంతో కలకలం రేగింది. విషయం శుక్రవారం ఉదయం నుంచి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. నెత్తుటి మరకలు ఎక్కడివి, మర్డర్ ఏమైనా జరిగిందా, ఎవరైన గాయపడ్డారా అనే విషయంపై మిల్స్‌కాలనీ పోలీసులు ఉదయం నుంచి క్లూస్‌టీంతో సమాచారాన్ని సేకరిస్తున్నారు. సాయంత్రం కాశికుంటకు పోలీసు ఉన్నతాధికారులు చేరుకుని దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. అసలు ఏం జరిగిందో తెలియక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

సెలూన్ల బంద్ విజయవంతం

హన్మకొండ చౌరస్తా : పెరిగిన ధరలకు అనుగుణంగా తమ సేవల ధరలను పెంచుతూ శుక్రవారం నిర్వహించిన సెలూన్ల బంద్ విజయవంతమైనట్లు హనుమకొండ పట్టణ కృషి నాయీబ్రాహ్మణ సేవా సంఘం హనుమకొండ చౌరస్తా కమిటీ అధ్యక్షుడు సింగారపు శ్యామ్ తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

- పాఠశాల ఆవరణలో విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలు
- భయాందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు





పాఠశాల ఆవరణలో విద్యుత్ వైర్లపై ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామం ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల ఆవరణలో విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తాకుతున్నాయి. గాలిదుమారానికి విద్యుత్ తీగలను చెట్ల కొమ్మలు తగలడంతో మెరుపులు వస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు.

వాష్ రూంకు వెళ్లేందుకు జంకుతున్న విద్యార్థులు

వాష్‌రూంకు వెళ్లే దారిలో విద్యుత్ తీగల కింది నుంచే విద్యార్థులు వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో చెట్ల కొమ్మల కారణంగా ఎప్పుడు ఏ తీగ తెగిపడుతుందోనని వారు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా గాలిదుమారం వచ్చినప్పుడు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు.

సమస్యకు పరిష్కారం చూపకుండానే..

విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించాలని విద్యుత్ టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించకుండానే మీ సమస్య పరిష్కరించినట్లు విద్యుత్ శాఖ నుంచి వింత సమాచారం వచ్చిందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని చెట్ల కొమ్మలను తొలగించాలని వేడుకుంటున్నారు.

మహానగరాన్ని ముంపు నుంచి కాపాడండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడుగంట రవికుమార్



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వరంగల్ అర్బన్ : వరంగల్ మహానగరంలో ముంపు ప్రాంతాలు ఏటేటా పెరుగుతున్నాయని, నాలాల కబ్జా, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో చినుకుపడితే నగరవాసులు జంకుతున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో చిన్నపాటి వర్షానికే జనావాసాలు, కాలనీలు నీట మునుగుతున్నాయని పేర్కొన్నారు. ఖిలావరంగల్‌లోని అగర్తల చెరువు కాల్వ ద్వారా శివనగర్‌పై ప్రాంతం నుంచి వర్షపు నీరు శివనగర్, పెరికవాడ, ఎస్.ఆర్.ఆర్ తోట అండర్ బ్రిడ్జి వంటి ప్రాంతాలను ముంచెత్తుతోందని వివరించారు. భద్రకాళి ఆలయ ఆధునీకీకరణ పేరుతో చేపట్టిన ఐలాండ్, మాడ వీధుల పేరుతో వైశాల్యాన్ని భారీగా తగ్గించారని, దీంతో ఇటు బొందివాగు నీరు చెరువులోకి వెళ్లే పరిస్థితి లేదని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఎగువ నుంచి మహానగరంలోకి ప్రవేశించే బొందివాగు సమస్యను పరిష్కరించడంలో ఏళ్ల నుంచి తాత్సారం జరుగుతోందన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్లు ఆడెపు స్వప్న, గందె కల్పన, బీజేపీ నాయకులు రత్నం సతీష్, హరిశంకర్, రంజిత్ కుమార్, రఘునారెడ్డి, కుమార్, జిల్లా కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి కూచన క్రాంతికుమార్, అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, నవీన్, నవీన్ ఉన్నారు.

'కేయూ భూముల జోలికి రావొద్దు'

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం కాకతీయ యూనివర్సిటీ భూమిని కేటాయించడం అన్యాయమని, కేయూ భూముల జోలికి రావొద్దని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు శరత్ చంద్ర అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ విద్యార్థి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేయూ భూములపై జరిపిన సర్వే వివరాలు తెలపాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్‌వి జిల్లా కో ఆర్డినేటర్ రాకేష్ యాదవ్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కేయూ వీసీ, పాలకమండలి సభ్యులు ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని, దీన్ని విరమించుకోక పోతే ఈ నెల 7న యూనివర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ పాల్గొనే కేయూ స్నాతకోత్సవాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.

బీజేపీ నేతలపై కేసు కొట్టివేత

హసన్‌పర్తి : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ నాయకులపై నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ పీడీఎం కోర్టు న్యాయమూర్తి శాంతి సోనీ తీర్పు ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రచారం చేశారని స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి, రైల్వేబోర్డు సభ్యుడు రాజు, సుమన్, భిక్షపతి, సుమన్‌లపై అభియోగాలు మోపారు. కేసును నిందితుల తరపున నర్సింహారాములు, మహేందర్‌లు వాదించారు.

ఘనంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హసన్‌పర్తి : మాజీ మంత్రి దయాకర్‌రావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బర్త్‌డే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, నాగరాజు, చంద్రమోహన్, యుగంధర్, శ్రీకాంత్, కృష్ణమూర్తి, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



సభకు వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరయ్యే హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే గ్రామ కమిటీ అధ్యక్షులు, క్రియాశీల కార్యకర్తల సమ్మేళన సభకు వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ముఖ్య నాయకులు పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. తూర్పు నియోజక వర్గానికి చెందిన నాయకులు, శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి 150 కార్లలో, మూడు బస్సులు, బయలుదేరి వెళ్లారు. సభకు తరలి వెళ్లిన వారిలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, జిల్లా, మండల, గ్రామ శాఖల అధ్యక్ష,కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



హసన్‌పర్తి : సభకు బయల్దేరిన కాంగ్రెస్ శ్రేణులు



హన్మకొండ చౌరస్తా : సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తెలంగాణ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. పలు చోట్ల కొమురయ్య చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో ప్రకాశ్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కొమురయ్య ఆయన ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



హన్మకొండ : దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్, తదితరులు



రామన్నపేటలో నివాళులర్పిస్తూ..



హన్మకొండ అర్బన్ : రక్తదానం చేస్తున్న ప్రకాశ్

మాజీ సీఎం రోశయ్యకు ఘననివాళి



హన్మకొండ : రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



వరంగల్ క్రైం : రోశయ్య జయంతి వేడుకలో పాల్గొన్న పోలీస్ అధికారులు

సాక్షి, నెట్‌వర్క్ : పాలనా నైపుణ్యానికి ప్రతిరూపం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం రోశయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అధికారులు, ఉద్యోగులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ శాంత స్వభావం, సౌమ్యత, విషయ స్పష్టతతో ఏ పనినైనా నిబద్ధతతో చేసేవారని కొనియాడారు. 28వ డివిజన్‌లోని ఆర్యవైశ్య సత్రంలో రోశయ్య జయంతి వేడుకలను పురస్కరించుకొని పేదలకు ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు గట్టు మహేష్ బాబు చీరల పంపిణీ చేశారు.



వరంగల్ అర్బన్ : వరంగల్ రామన్నపేట ఆర్యవైశ్య సత్రంలో చీరలు పంపిణీ చేస్తున్న మహేశ్‌బాబు



హన్మకొండ అర్బన్: రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



మామునూరులో రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ పూజ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబ రెడ్డి తెలిపారు. కాజీపేట రహమత్ నగర్, జూబ్లీ మార్కెట్, వెంకటాద్రి నగర్, కాజీపేట మెయిన్ రోడ్, రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, నక్కలగుట్ట వాటర్ ట్యాంక్ వెనుక వైపు ప్రాంతంలో సాయంత్రం 4 నుంచి 5.30 వరకు, ఎన్జీవోస్ కాలనీ, శ్యామల గార్డెన్, అమరావతి నగర్, టీవీ టవర్ కాలనీ, నాగరాజు దేవాలయం, ఎస్.వి.కన్వెన్షన్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ, శాంతినగర్, మదీనా రోడ్, హరిరమాదేవి హాస్పిటల్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, శివనగర్, మెట్లబావి, రాములవారి వీధి, బొడ్రయ్య వీధి, స్టేషన్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు, కాశిబుగ్గ, వివేకనంద, సాయి గణేష్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

సంక్షిప్త సమాచారం

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

మడికొండ: జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. శుక్రవారం మడికొండ శివారులోని పారిశ్రామిక వాడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ ప్రధాని మోదీ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులను యజమానులకు కట్టుబానిసలుగా మార్చే విధంగా చేస్తున్నారని అన్నారు.

మొరం తరలిస్తున్న జేసీబీ, టిప్పర్ సీజ్

మడికొండ: ఎలాంటి అనుమతి లేకుండా జేసీబీ సాయంతో మొరం తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని టిప్పర్, జేసీబీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ కిషన్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తుండగా మడికొండ శివారు కోచ్ ఫ్యాక్టరీ సమీపంలో జేసీబీ సాయంతో ఎలాంటి అనుమతి లేకుండా మొరం టిప్పర్ ద్వారా తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పట్టుకొని విచారించగా ఎలాంటి అనుమతి లేదని, ఇక్కడ మొరం తీసుకెళ్లి ఎక్కువ ధరకు విక్రయిస్తామని తెలిపారు. జేసీబీ డ్రైవర్ పలపు శ్రీను, టిప్పర్ డ్రైవర్ పల్లపు నాగరాజు ల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉపకార వేతనాలివ్వాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని ఫెల్లోషిప్ రాని పరిశోధక విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పలువురు పరిశోధకులు శుక్రవారం కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో నాన్ ఫెల్లోషిప్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో కూడా అందజేయాలని వారు వీసీని కోరారు.

రేపు మేదరి సంఘాల ప్రమాణ స్వీకారం

నయీంనగర్: తెలంగాణ మేదరి(మహేంద్ర) సంఘం, అనుబంధ సంఘాల ప్రమాణ స్వీకారం ఆదివారం ఉదయం 10:30 గంటలకు వరంగల్ హంటర్‌రోడ్ శ్రీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని వరంగల్ జిల్లా మేదరి(మహేంద్ర) సంఘం అధ్యక్షుడు ప్రతాపగిరి గోవర్ధన్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేదరి కులస్తుందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థినికి గురుకులంలో సీటు

న్యూశాయంపేట : చదువుపై ఆసక్తి ఉండి దూరం నడవలేక ఇబ్బంది పడుతూ గురుకులంలో సీటు కోసం తపన పడుతున్న నిరుపేద దివ్యాంగ విద్యార్థినికి జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కే.ఏ.గౌస్ హైదర్ శుక్రవారం 7వ తరగతిలో మైనారిటీ గురుకులంలో విద్యార్థిని సయ్యద్ సబ్జాన్‌కు అడ్మిషన్ ఇప్పించారు.

మహాసభను విజయవంతం చేయాలి

హన్మకొండ: మహబూబ్‌నగర్‌లో ఈ నెల 13న జరిగే కుల అసమానతల పోరాట సమితి మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జై చక్రవర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ సంఘం నాయకులు మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరియార్ 140వ జయంతి రోజున 2019 సెప్టెంబర్ 17న కుల అసమానతల నిర్మూలన పోరాట సమితిని స్థాపించినట్లు తెలిపారు.

సివిల్ రైట్స్‌డే ప్రోగ్రాం నిర్వహించాలి

నయీంనగర్ : జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసు ప్రకారం ప్రతీ నెల చివరి తేదిన ఎస్సీ,ఎస్టీ గ్రామాల్లో సివిల్ రైట్స్ డే ప్రోగ్రాం నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ కన్వీనర్ ఆర్.బి. పరశురామ్ నాయక్, కో కన్వీనర్ జి.రాజు కోరారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో సివిల్ రైట్స్ డే ప్రోగ్రాం నిర్వహణకు ఒక రోజు ముందు దండోరా వేయించాలన్నారు.

ఎక్సైజ్ సీఐని కలిసిన పాలకవర్గ సభ్యులు

కాజీపేట : స్థానిక ఎక్సైజ్ సీఐ వేముల చంద్రమోహన్‌ను శుక్రవారం సోమిడి గీత కార్మిక సంఘం నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు బోల్లికొడ యాదగిరి ఆధ్వర్యంలో సీఐని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పలు సమస్యలపై చర్చించారు.

రిజర్వేషన్ హామీని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్

హన్మకొండ: స్థానిక సంస్థల ఎన్నికల ముందే ముదిరాజ్‌లకు ఇచ్చిన రిజర్వేషన్ హామీని అమలు చేయాలని ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోషియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని మెపా కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేవేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మారుస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరించిందని విమర్శించారు. సమావేశంలో నాయకులు పొన్నం రాజు, పులి ప్రభాకర్, బైరి సోమయ్య, దండు చిరంజీవి, నీరటి రాజు, సింగారపు రామ కృష్ణ, పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు అందచేయాలి

వరంగల్ చౌరస్తా : ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ఏజెన్సీ నిర్వాహకులు పెండింగ్‌లో ఉన్న 12 నెలల వేతనాలు వెంటనే అందచేయాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం లేబర్ కాలనీలోని ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద కార్మికులతో సమావేశమై పలు డిమాండ్లపై ప్రస్తావించారు. అనంతరం వైద్యులకు వినతిపత్రాన్ని అందచేశారు.

కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలి

హన్మకొండ: యువతను మోసం చేసిన కాంగ్రెస్ నాయకులు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, నోటిఫికేషన్స్ జారీ చేయాలని విద్యార్థులు, నిరుద్యోగులు శుక్రవారం తలపెట్టిన చలో సెక్రటేరియట్‌ను భగ్నం చేస్తూ హనుమకొండతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులను అక్రమంగా ముందస్తు అరెస్టు చేయడాన్ని ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. యువత మీద పెట్టిన అన్ని అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

విద్యతో పాటు ఆరోగ్యంపై అవగాహన అవసరం

న్యూశాయంపేట : విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై అవగాహన అవసరమని ఆర్‌బీఎస్‌కే హనుమకొండ నోడల్ వైద్యాధికారి డాక్టర్ దుర్గ ప్రసాద్ అన్నారు. శుక్రవారం హనుమకొండ పెద్దమ్మగడ్డ వద్ద ఉన్న మైనారిటీ బాలుర గురుకులంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆహారపు అలవాట్లు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి రక్తహీనతతో ఉన్న పిల్లలకు మందులు పంపిణీ చేశారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన



హన్మకొండ కల్చరల్ : వరంగల్ బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నేషనల్ సర్వీస్ స్కీం సంయుక్త ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాల ద్వారా హెచ్ఐవీ నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఉచిత మెగా హెల్త్‌క్యాంపు

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ అండ్‌పీజీకాలేజీలో శుక్రవారం ఉచిత మెగాహెల్త్ క్యాంపును నిర్వహించారు.ఆకళాశాల హెల్త్‌క్లబ్, ఫిజికల్ ఎడ్యూకేషన్,వడ్డెపెల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్‌క్యాంపును నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌బి చంద్రమౌళి మాట్లాడారు. నిర్వహించారు.

పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలి

హన్మకొండ కల్చరల్ : అన్ని ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అన్నారు. శుక్రవారం తిమ్మాపూర్‌లోని ప్రభుత్వ ఎయిడెడ్ నూతన విద్యానిలయంలో టీఎస్ యూటీఎఫ్ వరంగల్ జిల్లా అడిట్ కమిటీ సభ్యుడు పోశాల కుమారస్వామి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కుమారస్వామిని సన్మానించారు.

దర్గా పాఠశాలకు సౌండ్‌సిస్టం అందజేత

కాజీపేట రూరల్ : కాజీపేట దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శుక్రవారం విద్యార్థులు ప్రతీ రోజు ప్రార్థన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం హండ్రెడ్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నిర్వాహకుడు కందగట్ల సత్యనారాయణ సౌండ్ సిస్టంను అందజేశారు.

హారికకు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : వరంగల్ పశ్చిమలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీకళాశాలలో గణిత అధ్యాపకురాలు బొల్లెద్దు హారికకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. కేయూలోని గణిత విభాగంలో పరిశోధకురాలుగా ఇన్విస్టిగేషన్ ఆఫ్ స్టడీ స్టేట్ ప్రాబలిటీ వెక్టర్ ఆఫ్ పాజిటివ్ ఇఫైనెట్ రెగ్యులరైజ్డ్ లీనియర్ సిస్టమ్ ఆఫ్ స్టోర్సా స్టిక్ మాట్రిక్స్ అంశంపై సమర్పించిన పరి శోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి హారికకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ తెలిపారు. కేయూ గణిత వి భాగం ఎల్‌పి రాజ్ కుమార్ పర్యవేక్షణలో హారికపీహెచ్‌డీ పూర్తిచేశారు.

లక్ష్మారెడ్డికి..



కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం పరిశోధకుడు పి.లక్ష్మారెడ్డికి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. అడ్వర్టైజ్‌మెంట్స్- ఏ స్టయిలిస్టిక్ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి లక్ష్మారెడ్డికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు.